
# ఫ్లోర్ లిఫ్ట్స్

శోభానంద్

కర్ర్...కర్ర్ర్ర్‌మంటూ బెల్ మోగింది.
మరుక్షణం కాబిన్ డోర్ తీసుకొని ఆంజనేయులు ప్రత్యక్ష మయ్యాడు. “అమ్మా!” అంటూ.



“బాగ్ తీసుకో” అంటూ అతన్ని పురమాయించి, టేబుల్ డ్రాలకి తాళాలు వేసాను. “అందరూ వెళ్ళిపోయారా?” ఒకసారి గడియారంకేసి చూసి అడిగాను.

“మేనేజర్ గారు, అకౌంటెంటు తప్ప అందరూ వెళ్ళిపోయారు. మేడం.” వినయంగా చెపుతూ, నా కారియర్ ఉండే బాగ్ తీసుకొన్నాడు ఆంజనేయులు.

“సరే పద.” అంటూ బైల్దేరాను.

విశాలమైన ఆఫీసు హాలు ఖాళీగా ఉంది. అందరూ వెళ్లిపోయారు. నా కాబిన్‌కి ఎదురుగా ఉండే మేనేజర్ కుమార్ గదిలో నీడలు కదులుతూ, అక్కడ ఇంకా ఎవరో ఉన్నారని చెపుతున్నాయి.

ఆంజనేయులు వడివడిగా వెళ్ళి లిఫ్ట్ బటన్ ప్రెస్ చేసాడు. మరో రెండు నిముషాల్లో లిఫ్ట్ వచ్చి ఆగింది. డోర్ తెరుచుకోగానే, అంతవరకు తీరుబడిగా స్టూల్ మీద కూర్చొని, హస్కు కొడుతున్న లిఫ్ట్‌బాయ్ చటుక్కున లేచి నిలబడుతూ, నాకు విష్ చేసాడు. అతని విష్‌ని స్వీకరిస్తూ లిఫ్ట్‌లో అడుగుపెట్టాను.

మధ్యలో ఎక్కడా ఆగకుండా తిన్నగా పదోఫ్లోరు నుండి, గ్రౌండ్ ఫ్లోర్ లో ఆగింది లిఫ్ట్. వినయంగా డోరు పట్టుకుని నిల్చున్న లిఫ్ట్‌బాయ్ రెండోసారి చెప్పిన నమస్కారం అందుకుంటూ బైటికి నడిచాను.

ఆంజనేయులు అప్పటికే పరిగెత్తి కారు దగ్గరికి చేరాడు. అంతసేపూ ప్రక్క కార్ల డ్రైవర్లతో బాతాఖానీ వేస్తున్న డ్రైవర్ సుందరం

హడావిడిగా డోరు తీసి పట్టుకొన్నాడు. కారెక్కాను. కారు బయల్దేరి ఆ బిల్డింగ్ గేటు దాటుతుంటే, ఈ రోజుకి ఈ షిఫ్ట్ ముగిసింది. అనుకుంటూ నిట్టూర్చాను.

ఉదయం పదిన్నర నుండి సాయంత్రం ఐదువరకు నేను ఆఫీసరమ్మను. నా కింద బోలెడు మంది స్టాఫ్, నలుగురు అటెండర్లు. ప్రతి పనిలో శ్రద్ధ చూపుతూ, పని విషయంలో స్ట్రిక్ట్‌గా ఉన్నా, వ్యక్తిగతంగా స్టాఫ్ అందరితో మంచిగా ఉంటానని, అందరూ నన్ను అభిమానిస్తారు. అయితే ఆ అభిమానం వంకతో పనిలో ఏదైనా తేడా చేస్తే మాత్రం ఊరుకోను. ఆ విషయం అందరికి తెలుసు కూడా.

కాని ఐదు దాటి నేను ఆఫీసు ఆవరణ దాటానంటే మామూలు గృహిణినే. ఇంటి దగ్గర నా రాక కోసం ఎదురు చూసే పిల్లలు, వారికోసం చేయాల్సిన పనులు, పగలంతా నాలాగే తనూ ఆఫీసులో పనిచేసి అలిసిపోయి వచ్చే భర్త. వీరందరిని సంతోష పెట్టాలనే తాపత్రయంతో ఒక సాధారణ స్త్రీగా రూపాంతరం చెందుతాను.

ఇప్పుడు కూడా కారు ఆఫీసు గేటు దాటగానే, ఆలోచనలు ఇంటి దగ్గర చేయాల్సిన పనుల మీదికి పోయాయి. స్కూలునుండి వచ్చేసిన పిల్లలు ట్యూషన్ కోసం సిద్ధపడుతూనే, నా రాకకోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తుంటారు. ఒక వేళ ఏ ట్రాఫిక్‌లోనో ఇరుక్కొని కొంచెం లేటయి, వాళ్ళు ట్యూషన్‌కి కూర్చొన్నాక వెళితే, కళ్ళతోనే వంద ప్రశ్నలేస్తారు. అందుకే, ట్యూషన్‌కి మాష్టారిని ఇంటికే వచ్చేలా మాట్లాడాను. కాకపోతే రోజంతా స్కూల్లో చదివి, మరో ఇంటికి ట్యూషన్‌కి వెళ్ళడానికి పిల్లలూ ఇష్టపడరు. అలా పంపినా కూడా, మరల స్కూల్లోలాగ యాభై మందిని లాగేసి, టైం పాస్ చేసే వాళ్లు కూడా ఉంటారని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను.

ఒకసారి ఆటోమేటిగ్గా, ఫ్రిజ్‌లో ఏం కూరగాయలున్నాయా అని ఆలోచించాను. టమోటాలు తప్ప ఏమీ లేవు. అయితే తప్పక కూరగాయలు కొనాలి. మా వారికి టమాటా లేకుండా కూర ఇష్టముండదు. వేపుళ్ళు తినకూడదని డాక్టర్ల సలహా ఎలానూ ఉంటుంది గదా. అంచేత పప్పో, చారో వేసి, ఒక పులుసు కూర చేయాలి.

ఆ చేసే వంటేదో మరల నేను చేయాలి. మరెవరు చేసినా తనకి తృప్తిగా ఉండదని, మా శ్రీవారి ఫిర్యాదు. మరి తప్పుదు కదా. ఆఫీసులో ఎంత ఒళ్ళు గుల్ల చేసికొని వచ్చినా లేని ఓపిక తెచ్చుకొని ఆ వంటేదో చేసిపడేయాలి. నన్నేదో పొగడటానికి ఆయన అలా అంటారని అనుకోను. ఎందుకంటే.. ఒకటి రెండుసార్లు గమనించాను. నా వంట తప్ప, ఇంకెవరు చేసినా, ఎవరైనా అంటే ఇంకెవరు వచ్చి చేస్తారు.. చేస్తే గీస్తే మా అత్తగారు... కాక మా అమ్మ. ఇంకెవరు చేసినా పాపం కడుపునిండా తినలేదు ఆయన. సాధారణంగా, భర్తలు వాళ్ళ తల్లి వంటను గుర్తు చేసుకొంటారంటారు. గాని, మా వారి విషయంలో అది ఎంతమాత్రం సత్యం కాదనే చెప్పాలి. ఇంక ఆయన వాలకం అర్థమైంది గనుక, ఎంత అలసటగా ఉన్నా, నేను గబగబ ఏదో ఒకటి వండి వార్చేస్తాను.

అందువల్ల ఆఫీసు అవతారం చాలించి, ఇంటి ఇల్లాలి అవతారానికి మారిన వెంటనే నేను చేసే మొదటి పని, కూరగాయల గురించి ఆలోచించడం, తరువాత మనసులోనే ఒక మెనూ అనేసుకోడం. దానికి తగ్గట్టు ఇంకా ఏమైనా వస్తువులు కావాలంటే, పచారీ కొట్టు దగ్గర ఆగి అవి కూడా కొనడం. ఇలా అన్ని ముగించుకొని ఇల్లు చేరాను. ఆ సరికి ట్యూషన్ మాష్టారు ఇంకా రానట్టుంది.

పాప, బాబు స్నానాలు ముగించేసి ఫ్రెష్‌గా తయారయి కార్టూన్ నెట్‌వర్క్ ముందు, జిగురేసి అతికేసినట్లు కూర్చున్నారు.

నన్ను కంటి చివరినుండి చూసి ''హాయ్ మామ్'' అంటూ ఒక అరుపు అరిచేసి, కార్టూన్‌లో మునిగిపోయారు.

అప్రయత్నంగా చుట్టూ చూసాను. పనామె రెండు రోజులుగా రావటం లేదు. ఈ పూట కూడా రానట్లుంది. ఇల్లంతా చిందరవందరగా ఉంది. పిల్లలు స్కూలు నుండి తెచ్చిన బ్యాగులు హాల్లోనే పడేసారు. షూస్ విప్పి, సాక్సు అవి, అటుఇటు విసిరేసారు.

కూరగాయల సంచులు పట్టుకొని డ్రైవరు వచ్చాడు. అతడితో పాటు వంటగదిలోకి వెళ్ళిన నాకు కళ్ళు తిరిగాయి. డైనింగ్ టేబుల్ మీద కంచాలు, గిన్నెలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. గిన్నెల మీద మూతలు లేవు. బాటిల్ పడిపోయి నీళ్లు భోజనాల బల్లనిండా పరుచుకున్నాయి.

''వెళ్ళొస్తానమ్మా'' అంటూ సుందరం బైటికెళ్ళిపోయాడు. అతను నా కంపెనీ కారు డ్రైవరు. నన్ను తీసుకెళ్ళడం, తీసుకు రావడం తప్ప, వాడికి మరో డ్యూటీ లేదు. ఆ డ్యూటీ తప్ప మరొకటి చెప్పినా చేయడు. చెప్పి అవమానపడడం తప్ప,

ఒరిగేదేమీ ఉండదు.

ఇంటి పరిస్థితి చూసేసరికి దుఃఖం పొర్లుకొచ్చింది. బలవంతంగా కంట్రోలు చేసుకుంటూ, బెడ్ రూంలోకి దారితీసాను. అక్కడి పరిస్థితీ అంతే. స్నానాలు చేసి, పిల్లలు స్కూలు బట్టలు క్రిందమీద పడేసి ఉంచారు. బెడ్స్ మీద తడి తువ్వాళ్లు బాత్ రూంలో నీళ్ళు పోతున్న శబ్దం, టాప్‌లు సరిగా మూయలేదని చెపుతున్నాయి. కుళాయి మూయడానికి వెళితే, గుమ్మం దగ్గరే పడి ఉన్న సబ్బు బిళ్ళ మీద కాలు పడి, జర్రున జారాను. అంత మటుకు గోడను పట్టుకొని ఆపుకున్నాను లేకపోతే

నడుం విరిగేదే!

## వాణిశ్రీకి ప్రత్యేక గౌరవం



భక్త ప్రహ్లాద సినిమాలో హిరణ్యకశిపుడు ముల్లోకాలు జయించి వచ్చిన సందర్భంలో ప్రజలు ఆనందంగా సంబరాలు జరుపుకుంటారు. అక్కడ ఒక నాట్య సన్నివేశంలో వాణిశ్రీ రెండునిముషాలు కనిపిస్తుంది. అప్పటికింకా మరపురానికథ సినిమా విడుదలకాలేదు. వాణిశ్రీ కథానాయికగా ఎస్టాబ్లిష్ కాలేదు. అయినా చెట్టియార్ ఆమె చేత ఈ చిన్న నృత్య సన్నివేశం చేయించారు. ఎందుకూ...? దీని వెనుక ఓ కథ వుంది. 1963లో ఏ.వి. ఎం.వాళ్లు తమిళంలో తీసిన నానుం ఒరు పెణ్ సినిమాను ఎస్.వి.రంగారావు తన వాణీఫిలింస్ పతాకంమీద తెలుగులోనాదీ ఆడజన్మే పేరుతో తీశారు. ఈ సినిమాలో చెట్టియార్‌కూడా భాగస్వామి.అందులో జమున వేషాన్ని మొదట వాణిశ్రీచేత వేయిద్దామని రంగారావు అనుకున్నారు. చెట్టియార్‌కు ఆమెను పరిచయం చేశారు. కానీ చెట్టియార్‌కు వాణిశ్రీ ఎంతమాత్రం నచ్చలేదు. దాంతో ఆ వేషం జమునకు వెళ్లిపోయింది. 1966లో తను ఫైనాన్స్ చేసిన ఒక తమిళ సినిమా రష్ చూసిన చెట్టియార్ అందులో నాయికగా నటించిన వాణిశ్రీ అభినయానికి ముగ్ధులయ్యారు. ఆమెచేత ఏమైనాసరే ఈ సినిమాలో ఒక చిన్న నృత్యమైనా చేయించాలని మనసుపడ్డారు. ఫలితమే ఈ నాట్య సన్నివేశం. ప్రహ్లాద హిందీ వెర్షన్‌లోకూడా మనమీ నాట్యాన్ని చూస్తాం. ఫోటోలో వాణిశ్రీ కనిపిస్తోంది ఆ గెటప్‌తోనే. తమాషా ఏమిటంటే తాను ఒకనాడు తిరస్కరించిన వాణిశ్రీ ఈమే ఒకరేనని చెట్టియార్‌కు ఆ తరువాత చాలాకాలం దాకా తెలీదు.

సబ్బు తీసి సోప్ కేసులో వేసి, కుళాయి మూసి, మూతలు తీసేసి ఉన్న షాంపూ సీసాల మీద మూతలు బిగించి బైటికొచ్చాను.

చకచకా బట్టలు మార్చుకొని, నా రెండో అవతారంలోకి పరకాయ ప్రవేశం చేసాను. ఇపుడు నేను ఇల్లాలు కం పనిమనిషి. గబగబ వెళ్ళి, హాల్లో మోగుతున్న టీవీ టాప్‌ని కట్టేసాను. అందులో లీనమయి చూస్తున్న పిల్లలు..ఆశ్చర్యంగా నావైపు చూసారు.

"మమ్మీ. ప్లీజ్" అంటున్న వారిని వారించాను.

"పాపా, లేచి బెడ్‌రూం సర్దు" అంటూ కొడుకు కేసి తిరిగాను. వాళ్ళకు నా మూడ్ అర్థమైపోయింది.

"నువ్వు లేచి స్కూలు బేగులు, షూస్ తీసి సర్దు. కుర్చీల్లో పేపర్లు తీయాలి. కంప్యూటర్ టేబుల్ మీద పుస్తకాలు తీయాలి." టకటక చెప్పాను.

ఇద్దరూ మౌనంగా తమ తమ అసైన్‌మెంట్లకి బయలుదేరారు.

ఇక నేను, నడుం బిగించి వంట గదిలోకి నడిచాను. సింక్‌లో పొద్దున గిన్నెలు అలాగే పడిఉన్నాయి. అది చాలవన్నట్లు డైనింగ్ టేబుల్ మీద గిన్నెలు, కంచాలు. ఒకసారి సింక్‌లో గిన్నెలకేసి చూసాను. అవేమీ నాకిప్పుడు వంటకి అవసరం లేదు.

వేరే గిన్నెలు తీసికొని, ఒక బర్నర్ మీద పప్పు, మరో బర్నర్ మీద బియ్యం ఎసరుపోసి పడేసాను. వాటి మటుకు అవి ఉడుకుతుంటే, చకచక డైనింగ్ టేబుల్ క్లియర్ చేసాను.

హాల్లో పిల్లలు నువ్వంటే నువ్వని గొడవ పడుతున్నారు. "పాపా" ఒకసారి గట్టిగా అరిచాను. అర్థమైనట్లు, ఇద్దరూ ఎవరి పనిలో వాళ్ళు పడ్డారు. మరో పదినిముషాల్లో డైనింగ్ టేబుల్ క్లియర్ అయి, సింక్‌లో గిన్నెల ఎత్తు పెరిగింది.

"మమ్మీ. అయిపోయింది." అంటూ పిల్లలు వచ్చారు.

"కూర్చోండి" అంటూ డైనింగ్ టేబుల్ చూపి, గబగబ పాలు కలిపి ఇచ్చాను. వాళ్ళు త్రాగి ముగిస్తుండగా, ట్యూషన్ సారు వచ్చాడు.

పిల్లలు ట్యూషన్‌లో కూర్చొన్నారు. అప్పటికి సగం పనయిన ఫీలింగ్.

కూరగాయలు కోయడానికి కూర్చుంటూ బైటికి చూసాను. మబ్బులు పడుతుంది ఆకాశం. వర్షం వచ్చేలా ఉంది...అనుకుంటూ, బైట వేసిన బట్టలు తీసేదానికి, వెనక్కి పరుగెత్తాను.

స్టౌ మీద పప్పు వేసిన కుక్కర్ ఈలలు మొదలెట్టింది. ఆటోమేటిగ్గా ఈలకి ఈలకీ మధ్య గాప్‌ను గమనిస్తూ, బట్టలన్నీ లాగి చేతులమీద వేసికొని, పిల్లల బెడ్‌రూంలోకి వచ్చాను. పేరుకి పిల్లల బెడ్‌రూంగాని, పిల్లలింకా మాతోనే పడుకుంటున్నారు. అంచేత ఆ బెడ్లు ఖాళీగా ఉంటాయని ఆరిన బట్టలు వాటి మీద వేసి, మడతలు పెట్టే పని చూస్తాను.

అనుకున్నట్లే నేను లోపలికి రావడమే సన్నగా జల్లులతో వాన మొదలైంది. పెరట్లో మట్టి తడిసి కమ్మటి వాసన వస్తోంది. నాకు చిన్నప్పటినుండి మట్టి వాసనంటే ఎంతో యిష్టం. వాన కురుస్తుంటే, ఆ ధారలతో ఆడాలని, కురిసే వానని చూడాలని ఆశ. కాని ఇపుడు అలా చూస్తూ కూర్చొనే దానికి టైం ఏది?

కుక్కర్ ఈలల మధ్య గాప్ తగ్గిపోతూండడంతో, ఆ స్టౌవ్ కట్టేసాను. రెండో పొయ్యిమీద అన్నం కుతకుతలాడుతుంటే మంట తగ్గించి, మూత పెట్టాను.

పెళ్ళయిన మొదట్లో అత్తెసరు అన్నం వండడం వచ్చేది కాదు. పాపం. మా శ్రీవారు ఓపిగ్గా నేర్పించారు. రెండు మూడుసార్లు జావలాంటి అన్నం తాగి... ఇప్పుడు బాగా అలవాటయిపోయింది. పాతబియ్యమే కాదు. కొత్తబియ్యం కూడా టెక్నిగ్గా

అత్తెసరు వండడం వచ్చేసింది నాకు.

డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని, చకచక బీరకాయిల చెక్కు పీలర్‌తో తీసేసి, చేదు చెక్ చేసాను. దేవుడి దయవల్ల అన్ని కాయలు బాగున్నాయి. ఒక్కోసారి పంతం పట్టినట్టు మెజారిటీ కాయలు చేదుగా ఉండిచస్తాయి. మరో పావు గంటలో కూర ముక్కలు రెడీఅయినాయి. దాంతో పాటే అన్నం పని కూడా ముగియడంతో, అన్నం గిన్నె దించి, మంట ఆర్పకుండానే దాని మీద కళాయి పెట్టి కూరకి సిద్ధం చేసాను.

సుయ్యి, సుయ్యి చప్పుళ్ళతో తాలింపు వేగుతుంటే కిచెన్‌లో ఎగ్జాస్ట్ ఫ్యాను వేసాను. లేకపోతే ఈ తాలింపు ఘాటుకు పిల్లలు, మాష్టారు కూడా తుమ్ములు లంకించుకుంటారు.

వేగిన తాళింపులో బీరకాయ ముక్కలు వేసి, ఉప్పు, పసుపు జల్లి మూత పెట్టి, కుక్కర్‌కేసి మళ్ళాను. ఈ కూరగాయల




ఆధునిక దంత వైద్యం

ప్రొ॥ డా॥ పి.వి.పార్థసారథి
M.D.S., F.A.A.C.D. (USA)
కాస్మటిక్ డెంటల్ స్పెషలిస్ట్





ముందు పళ్ళు వంకరగా ఉండి మాట్లాడినపుడు, నవ్వినపుడు ఎంతో వికారంగా కనిపించేవి. వీటివల్ల పెదాలు, ముఖం షేప్ మారిపోయింది. ఇన్ఫీరియారిటి కాంప్లెక్స్‌తో నలుగురితో కలవడం, నవ్వుకోవడం చేసి కొన్ని సంవత్సరాలైంది. పత్రికల్లో డాక్టరు గారి ప్రకటన చదివి అనుకొన్నా! "ఇంత వికారమైన పళ్ళను రెండు రోజుల్లో ఎలా సరిచేస్తారో? అసలిదంతా సాధ్యమేనా?" అయినా చూసొద్దామని కొన్ని వందల కిలోమీటర్లు రాత్రంతా ప్రయాణం చేసి తిరుపతిలో డాక్టర్ని కలిశా. నిజంగానే ఆధునిక దంతవైద్యం ఓ అద్భుతం!!! అనుకొన్నట్లే రెండు రోజుల్లో నా చికిత్స పూర్తయింది. నా ఆనందానికి అంతులేదు. డాక్టరుతో అన్నా "మీ పత్రికా ప్రకటన నా జీవితాన్నే మార్చేసింది".

పార్థ దంత వైద్యశాల & రీసర్చి సెంటర్
RTC బస్టాండ్ వెనుక, శ్రీనివాసం కాంప్లెక్స్ ఎదురుగా,
పెద్దకాపు లేఔట్, తిరుపతి. Ph:0877-2250555, 2250105

హడావిడిలో పప్పుచారు కోసం చింతపండు నానేయడం మర్చిపోయాను.

షెల్ఫులోంచి చింతపండు తీసి, కొద్దిగా నీళ్ళు చేర్చి, మైక్రో వేవ్‌లో వేడిచేసేసాను. అలా అయితే, మరల అది నానేదాక వెయిట్ చేసే బాధ తప్పుతుంది. మైక్రోవేవ్‌తో చిట్కాలు ఇలాంటి కొన్ని పనులు చేయడం నేనే కనిపెట్టాను. ఉదాహరణకి, హడావిడిగా పెరుగు కావాలంటే, తోడేసిన పాలను మైక్రోవేవ్‌లో కొంచెం వేడి చేసి, హాట్ బాక్స్‌లో పెట్టేస్తాను, పావుగంట, ఇరవై నిముషాల్లో పెరుగు రెడీ. అలాగే వెల్లుల్లిపాయల పొట్టు తీయాలన్నా, కొన్ని పాయల్ని మైక్రోవేవ్‌లో పెట్టి వేడి చేస్తే పాప్‌కార్న్ పేలినట్టు పేలి, తొక్కలు పాయనుండి విడిపోతాయి. జాగ్రత్త కోసం పైన డిష్ బోర్లిస్తాలెండి.

ఇప్పుడు కూడా అలానే చింతపండు రసం తీసి, పప్పుచారు కలిపేసాను. అందులో కారం, ఉప్పు వేసి మరగడానికి పెట్టి కూర తిరగేసాను. సగం సగం ఉడికింది. ఇక ఇప్పుడు కూర ఉడకాలి. చారు మరగాలి. నాకు కొంచెం బ్రీతింగ్ స్పేస్ దొరికింది కాబట్టి, వేడి వేడిగా కాఫీ తాగుతా... అనుకుంటే....హడావిడిగా ఫోను మ్రోగింది.

కాఫీ కప్పు టేబుల్ మీద పెట్టి వెళ్ళాను.

''హలో'' అట్నుంచి మా శ్రీవారి గొంతు.

''వచ్చేసావా? వర్షం పడుతుంటే ఎక్కడున్నావో అని కంగారేసింది.'' అయన అంత ఆతృతగా అడుగుతుంటే, ప్రేమ పొంగింది. వచ్చి చాలాసేపయిందండి. వంట చేస్తున్నా.'' చెప్పాను.

కిచెన్ సింక్‌లో గిన్నెలు గుర్తొచ్చాయి. కాఫీ మరిగించి ఆ పని చేయాలి అనుకుంటూ, కాఫీ చల్లారిపోతుందేమో అన్న అనుమానంతో డైనింగ్ టేబుల్ కేసి చూసాను.

''సరే మరి, పిల్లలేం చేస్తున్నారు?'' అడిగారు శ్రీవారు.

''ట్యూషన్‌లో ఉన్నారు.'' చెప్పాను.

''సరే. ఉంటాను'' అంటూ ఫోను కట్ చేసారు.

నేను కూడా ఫోను పెట్టి లోపలికి నడిచాను. భయపడ్డట్టే వర్షం వాతావరణం చల్లగా ఉండడంతో, కాఫీ చల్లారిపోయింది. ఒక పది సెకన్లు మైక్రోవేవ్‌లో వేడి చేసికొని, గబగబ త్రాగేసాను. కాఫీను ఆస్వాదిస్తూ త్రాగే అవకాశం ఎప్పటికైనా వస్తుందా అని అనుమానం వచ్చింది.

ఈ రెండు రోజులుగా పనమ్మాయి రాకపోడంతో నేనే గిన్నెలు తోమడం, బట్టలుతకడం చేస్తున్నాను గాబట్టి, ఏప్రాన్ ఒకటి బైట ఉంచాను. ఇపుడు ఆ ఏప్రాన్ తగిలించుకొని గిన్నెలు కడిగే పనిలో పడ్డాను.

ఇద్దరం పనులకెళ్ళిపోతాం గదా అని ఎవరినైనా పనికి పెట్టుకుందాం అంటే, ఎవరూ దొరకలేదు. మా అమ్మ, అత్త ఇద్దరూ టీచర్లుగా చేసేవారు. అంచేత వాళ్ళిద్దరికీ వచ్చి ఉండే వీలుండేది కాదు. పోనీ పనమ్మాయినెవరినైనా చూడండి ఇంట్లో ఉండేదానికి అంటే, అదీ కుదరలేదు. పిల్లలు పసివాళ్ళుగా వున్నప్పుడు మరీ ఇబ్బందయిపోయింది. వాళ్ళకోసం తను ఆన్ అండ్ ఆఫ్ ఉద్యోగాలు చేయడం వల్ల.... ఇలా ప్రైవేట్ కంపెనీలో ఉండాల్సొచ్చింది. ఒకటి రెండు గవర్నమెంట్ ఉద్యోగాలకి అవకాశం వచ్చినా, పిల్లల దగ్గర ఎవరూ ఉండరన్న ఒకే ఒక కారణంతో అవి మానుకున్నాను. మానుకొన్నందుకు నాకు బాధ లేదు. అది మాత్రం నిజం. కాని ఒక్కోసారి, ముఖ్యంగా ఇలాంటి పరిస్థితుల్లో, ఒక్క పనిపిల్లను చూసి పంపలేని అమ్మమీద, అత్తమీద విపరీతమైన కోపం వస్తుంది. విసురుగా గిన్నెలు కడిగేస్తూ ఆలోచిస్తున్నాను. అంతలోనే మరల ఫోను. ఈసారి ఊర్లోనే ఉండే మా తోడికోడలు. ఆవిడ దగ్గర పనమ్మాయి ఉంది. అంచేత ఆమె కూడా లెక్చరర్ అయినా, కాలేజి నుండి వచ్చేసి, ఏం చేయడానికి తోచక అందరికి ఫోన్లు చేస్తూ కూర్చుంటుంది. ఇప్పుడు కూడా అదే ఫోను. లోపల్లోపల చిరాగ్గా ఉన్నా, అణిచిపెట్టుకుంటూ మాట్లాడి, ఫోను ముగించాను.

ఒకసారి కూర తిరగేసి, మరల సింకులో చేతులు దూర్చాను. బైట వాన జోరు తగ్గినట్లుంది. శబ్దం వినిపించడం లేదు. సింకుకు వెనగ్గా ఉన్న కిటికీలోంచి చూసాను. పూలజల్లులా చినుకులు సన్నగా పడుతున్నాయి. ఇలాంటి జల్లంటే నాకు చాలా యిష్టం. ఏం చేస్తాం....అనుకుంటూ సింకు శుభ్రం చేసి ఆ పని ముగించాను.

ఉదయం కొన్ని బట్టలే మిషన్‌లో వేసాను. సాయంత్రం వచ్చి మిగతావి వేయచ్చులే అని. కానీ ఇపుడు చూస్తే వానకురిసింది. ఇపుడు మిషన్ వేసానా, ఆరేయడం కష్టం. ఇంక రేపే వేయాలి. అనుకుంటూ...బుట్టనిండా ఉన్న బట్టల మీంచి దృష్టి మళ్ళించి, లోపలికొచ్చాను.

మరో అరగంటకి పిల్లల ట్యూషను, పొయ్యిమీద కూర ఒకేసారి ముగిసాయి. మాస్టారు బైటికి పోగానే, పుత్రరత్నం వంటగదిలోకి దూసుకొచ్చాడు ఆకలంటూ...

నిజానికి అపుడు టైం ఇంకా ఎనిమిది కూడా కాలేదు కాని మా వాడికి చేయడానికి మరో పని లేకపోతే, ఏదైనా తినేయాలి. అపుడెలాగూ వంట అవుతున్న వాసనలు పీల్చి పీల్చి వున్నాడు గదా... ఏకంగా భోజనం అంటూ రెడీ అయిపోయాడు.

వాళ్ళకి వడ్డించేస్తే పనయిపోతుంది కదా అన్న ఉద్దేశ్యంతో నేను కూడా వాళ్ళకి భోజనాల పని చూడసాగాను. ప్రక్కన కూర్చొని వడ్డిస్తూంటే తృప్తిగ తిని లేచారిద్దరూ. తిన్నంతసేపూ స్కూల్లో విషయాలు చెప్తూ, వాళ్ళ స్నేహితుల విషయాలు చెప్తూనే ఉన్నారు.

వాళ్ళు లేచాక ప్లేట్లు తీసి ఒకేసారి కడిగేసాను. మరల ఉదయం పనామె రాకపోతే, అపుడు కడగడం ఇబ్బంది అవుతుంది.

పిల్లలు మళ్ళీ టీవీ ముందు సెటిల్ అయ్యారు. ఇందాక ఎలాగూ ఆపేసాను గదా అని ఈసారి ఏమీ అనలేదు. నేను కూడా వెళ్ళి వాళ్ళతో కూర్చున్నాను. ఎలాగూ భోజనాలు ముగిసాయి గదా, ఇక మరో అరగంట, గంటలో నిద్రకు పడతారు.

ఊహించినట్లే కొడుకు చిన్నగా సోఫాలో జోగడం మొదలెట్టాడు. పాప కూడా కళ్ళు భారంగా పెట్టి ఉండడంతో, టీవీ బంద్ చేసి, పడగ్గదికి బయల్దేరాం.

మరో పదినిముషాల్లో గాఢనిద్రలోకి జారిపోయిన పిల్లల్ని చూచి గాఢంగా నిట్టూర్చాను. ఇప్పటికి నా దైనందిన చర్యలో మూడు షిఫ్టులు ముగిసాయి. ఆఖరి షిఫ్ట్ మాత్రం మిగిలి ఉంది.

నైటీ, టవల్ తీసికొని బాత్‌రూంలోకి నడిచాను. నాల్గో షిఫ్టుకు రెడీ అవడానికి.

నాల్గో షిఫ్టు పూర్తిగా నాకు, మా వారికే పరిమితం. తను వచ్చేసరికి ఇంచుమించు పదవుతుంది. అప్పటిదాకా వస్తున్న నిద్రను బలవంతంగా ఆపుతూ, లోపల గోల పెడుతున్న ప్రేగుల్ని మందలిస్తూ వెయిట్ చేయడం నాకు అలవాటు. ఎలాగూ ఉదయం నుండి రాత్రి వరకు ఎవరి హడావిడిలో వాళ్ళం ఉంటాం. కనీసం ఈ టైం కన్నా మనసు విప్పి మాట్లాడుకోపోతే, బ్రతుకు మరీ యాంత్రికంగా అయిపోతుందని భయం.



పాపం ఆయన నన్ను వెయిట్‌చేయమని అడగరు గాని, నాకే ఉండాలని అనిపిస్తుంది. ఒక్కోసారి బాగా అలసిపోయినపుడు మాత్రం నాల్గో షిఫ్టు కాన్సిల్ అయిపోతుంది.

ఇవేళ కూడా బాగా అలసటగా ఉంది గాని, గత మూడు రోజులుగా నాల్గో షిఫ్టు ఏదో వంకన కాన్సిల్ అవుతుంది అందుచేత ఇవాళ వెయిట్‌చేసితీరాలని దృఢంగా నిశ్చయించుకొని ఉన్నాను. కొంతసేపు టీవీ చూసాను. ఇంకొంతసేపు ఉదయం హడావిడిగా తిరగేసిన పేపర్లు క్షుణ్ణంగా చదివాను.

అంతలోకే నా వెయిటింగ్ ముగిసినట్లు, మా వారి కారు శబ్దం వినిపించింది. పేపర్లు పక్కన పెట్టిలేచాను.

"ఏమోయ్, ఏమిటి విశేషాలు? ఇంకా మెలకువగా ఉన్నావే?" నన్నుచూస్తూ అడిగారు శ్రీవారు.

"ఏముంది. అంతా మామూలే." అంటూ ఆయన చేతిలో బ్రీఫ్‌కేస్ అందుకున్నాను.

"పిల్లలు అన్నం తిన్నారా?" రోజూ ఆయన అడిగే మొదటి ప్రశ్న. అప్పటికేదో వాళ్ళకి అన్నం పెట్టకుండా కావాలని వాళ్ళని పడుకోబెట్టేసినట్లు అని ఒక్కసారి చిరాకేస్తుంది. కాని, అది ఆయనకి అలవాటు.

"తిన్నారు." అంటూ కిచెన్‌లోకి నడిచాను.

మరో పది నిముషాల్లో స్నానం చేసి వచ్చాక ఆయనతో కలిసి భోజనం చేసాను. తింటున్నంతసేపూ ఇద్దరం ఇద్దరి ఆఫీసు కబుర్లు చెప్పుకున్నాం.

భోజనం అయి హాల్లో టీవీ దగ్గరకి చేరాం. ఎంత లేటయినా టీవీ ముందు అరగంటయినా కూర్చోందే ఆయనకి తృప్తిగా ఉండదు.

రిలాక్స్‌డ్‌గా సోఫాలో కూర్చుని టీవి చూస్తున్న వారల్లా హఠాత్తుగా లేచారు.

"ఏమయింది?" కంగారుగా అడిగాను.

"నా బ్రీఫ్‌కేసేది?" అడుగుతూ అటు ఇటు చూస్తున్నారాయన.

"అదిగో అక్కడ" ఎప్పుడూ పెట్టే స్థలం చూపిస్తూ అన్నా. 'ఏం మర్చిపోయారో పాపం' అనుకుంటూ నిశ్శబ్దంగా చూస్తున్నాను. అలాంటి టైంలో ఆయన త్వరగా టెన్షన్ ఫీలవుతారు. నేనే కాదు. ఎవరైనా ఏమైనా ప్రశ్నవేస్తే మరీ చిరాకయిపోతారు. అది తెలుసు గనుకనే, నేను మౌనంగా ఉండిపోయి చూస్తున్నాను.

గబగబ బ్రీఫ్ కేస్ తీసి, ఏదో తీసికొని, మరల బ్రీఫ్ కేస్ మూసేసారు.

వెనక్కి తిరిగి నా దగ్గరకి వచ్చారు. చేతిలో కాగితం పొట్లంలో మల్లెపూలు. అవి చూచి ఫక్కున నవ్వాను. అయన కంగారుకు ఏదో ముఖ్యమైన కాగితమో, ఫైలో అని భయపడ్డాను. తీరా మల్లెపూలను చూసేసరికి మనసు తేలిక పడింది.

"ఏంటోయ్ నవ్వుతున్నావ్?" అయోమయంగా అడిగారు.

ఆయన హడావిడి, నా ఆలోచన చెప్పాను. తను కూడా గట్టిగ నవ్వేసారు.

"అయినా మల్లెపూల ఇంపార్టెన్స్ మాత్రం తక్కువటోయ్! వాటి విలువ తెలియకనే అలా అంటున్నావా?" పూలు మడిచి తలలో పెట్టుకొంటున్న నాకేసి చూస్తున్న ఆయన కళ్ళల్లో భావాలు నాకు సులభంగా అర్థమయ్యాయి.

ఇద్దరం చిన్నగా నవ్వుకుంటూ లేచి, టీవీ, లైట్ ఆఫ్‌చేసి లోపలికి నడిచాము.

ఉదయాన్నే మొదలయ్యే నాఫస్ట్ షిఫ్ట్ పనులను గురించి నా మనసు, నా ప్రమేయం లేకుండానే ఆలోచిస్తుంది. పిల్లలకి బాక్సులు, శ్రీవారికి, పిల్లలకి బ్రేక్‌ఫాస్ట్, పిల్లలని స్కూలుకి సిద్ధం చేయడం ఫస్టు షిఫ్ట్ పనులు.

రెండో షిఫ్ట్- ఆఫీసు. మూడో షిఫ్ట్ ఇంటి పని. ఒకటి, మూడు షిఫ్టులు ఇంచుమించు ఒకలాగానే ఉంటాయి.

ఈ నాలుగు షిఫ్టుల్లో నాకు నచ్చే షిఫ్టేది అంటే మాత్రం చెప్పడం కష్టమే.

పిల్లలకి, భర్తకి పనులు చేసి పెట్టడంలో ఒక ఆనందం ...

మనకి అప్పచెప్పిన ఆఫీసు పని సక్రమంగా చేయడంలో సంతృప్తి ...

ఇక ప్రేమించిన భర్తతో ఏకాంతంగా కొద్దిసేపయినా గడపడంలో ఉన్న సంతోషం, మాటల్లో వివరించేది కాదు. ఏ షిప్టులో కష్టాలు, యిష్టాలు ఆ షిఫ్ట్‌లో ఉన్నా, అన్ని షిప్టులు చిరకాలంగా ఇలాగే సాగి పోవాలనుకుంటూ, లైటు ఆఫ్‌చేసి మంచం మీద వాలాను.


విశ్వసించు-
విజయాన్ని పొందు
తెలుగు/హిందీ/
ఆంగ్లంలో లభించే
ఉచిత పుస్తకానికై
నేడే మాకు వ్రాయండి.
అబండెంట్ లైఫ్ రిసోర్సెస్
పోస్ట్ బ్యాగ్ నెం. 24,
సికింద్రాబాద్ - 500 026.

